AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
11-9-2025 (Thursday) MAIN EDITION

## పైపైకి బంగారం ధరలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** భారతీయ మార్కెట్‌లో బంగారం ధరలు రోజురోజుకీ గరిష్ట స్థాయిని చేరుతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడడం.. పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తి అయిన బంగారం వైపు మొగ్గు చూపుతుండడంతో పసిడి ధరలు పైపైకి పోతున్నాయి. నేడు బంగారం ధరలు పరిశీలిస్తే.. 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) రూ.1,10,520గా ట్రేడ్ కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,01,310గా నమోదైంది. ఇక వెండి కిలో ధర హైదరాబాద్‌లో రూ.1,39,900గా ఉంది.

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం రేంజ్ బౌండ్‌లో కొనసాగింది. అయితే ఇంట్రాడే కనిష్టాల నుంచి బలంగా పుంజుకుని ఓ మోస్తరు లాభాలతో ముగిశాయి. భారత్, యూఎస్ మధ్య వాణిజ్య చర్చల విషయంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుండడం ఇన్వెస్టర్లలో ఆందోళనను తగ్గించింది. గురువారం ఉదయం సెన్సెక్స్ 208 పాయింట్లు, నిఫ్టీ 28 పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి. వెంటనే కోలుకుని లాభాల బాట పట్టాయి. చివరికి సెన్సెక్స్ 123 పాయింట్ల లాభంతో 81,548 వద్ద, నిఫ్టీ 32 పాయింట్ల లాభంతో 25,005 వద్ద స్థిరపడ్డాయి.

## హైదరాబాద్‌లో భారీవర్షం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. హయత్ నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్ ప్రాంతాల్లో వాన దంచి కొట్టింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వరద నీరు ఎగువ నుంచి వచ్చి నేషనల్ హైవేపై చేరింది. అలాగే మెదక్ పట్టణంలో భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరింది.



## భారత్ – పాక్ మ్యాచ్ రద్దు పిటిషన్ నిరాకరణ

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి భారత్ - పాకిస్తాన్ మ్యాచ్ రద్దు చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా పహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ పరిస్థితుల్లో సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరగబోయే భారత్ - పాక్ ఆసియా కప్ మ్యాచ్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. కాగా.. న్యాయమూర్తులు జే.కే.మహేశ్వరి, విజయ్ బిష్ణోయి ధర్మాసనం పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది.

## ఆడుకుంటూ కుప్పకూలిన విద్యార్థి



**అక్షరటుడే, వరంగల్:** వరంగల్‌లోని నయీంనగర్‌లో టెన్త్ విద్యార్థి జయంత్ మైదానంలో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ముక్కు, చెవిలోంచి రక్తం రావడంతో టీచర్లు అతడిని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలోనే చనిపోయినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఘటనపై కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా యాజమాన్యమే కొట్టి చంపేసినట్లు ఆరోపించారు. విద్యార్థి ఫ్యామిలీకి పరిహారం ఇవ్వాలని, కారకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.



**బీఆర్ఎస్‌లో చెలరేగిన అసమ్మతి రాగం సోషల్ మీడియాలో ప్రతిధ్వనిస్తోంది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసినా ఇప్పటికీ ఆధిపత్య పోరు కొనసాగుతోంది. సోషల్ మీడియా వేదికగా వారివారి అనుచర వర్గం దుమ్మెత్తి పోసుకుంటోంది. అవినీతి ఆరోపణలు, దూషణలు దాటి వ్యక్తి'గతాలు' తవ్వుకునే దాకా పోయింది. రెండు గ్రూపుల సోషల్ మీడియా వారియర్లు పరస్పర విమర్శలతో రెచ్చిపోతుండడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో ఎవరేం చేశారో, ఎలాంటి నీతి మాలిన పనులకు పాల్పడ్డారో పేర్కొంటూ బజారుకెక్కుతున్నారు. కవిత మద్దతుదారులుగా భావిస్తున్న 'కవితక్క అప్‌డేట్స్' అనే 'ఎక్స్' ఖాతా నుంచి వస్తున్న వరుస పోస్టులు పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఇప్పుడీ వ్యవహారం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది.**

**-అక్షరటుడే, హైదరాబాద్**

# సోషల్ వార్

- సామాజిక మాధ్యమాల్లో కవిత వర్సెస్ బీఆర్ఎస్
- తారాస్థాయికి చేరిన దుష్ప్రచారాలు
- కిమ్మనని గులాబీ పార్టీ అధినాయకులు

తనకు వ్యతిరేకంగా పార్టీలో కుట్ర జరుగుతోందని కవిత ఎప్పటి నుంచో చెబుతున్నారు. సొంత పార్టీ నేతలే తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆమె గతంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలోనే వాపోయారు. అయినా పార్టీ నాయకులు స్పందించడం లేదని తన గోడు వెల్లబోసుకున్నారు. అయినప్పటికీ కేసీఆర్ గానీ, కేటీఆర్ గానీ స్పందించలేదు. కనీసం తమ అనుచరులను కూడా వారించలేదు. దీంతో వారు మరింత రెచ్చిపోతున్నారు.

### వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ..

కవిత ఎప్పుడైతే అసమ్మతి గళం విప్పడం ప్రారంభమైందో అప్పటి నుంచి ఆమెపై పార్టీలోని కొందరు రెచ్చిపోవడం ప్రారంభించారు. సోషల్ మీడియాను ఆసరాగా చేసుకుని ఆమెకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం మొదలెట్టారు. బీఆర్ఎస్ అధినాయకుడి కూతురు అన్న విషయం కూడా మరిచి ధునుమాడుతున్నారు. పార్టీలో, అధికారంలో తనకూ భాగస్వామ్యం కావాలని కోరుకున్న ఆమె తన వ్యాఖ్యలతో పార్టీ లైన్ దాటిందని భావించి బీఆర్ఎస్ నుంచి పంపించేశారు. అంతటితో వదిలేస్తే అయిపోయేది కానీ. కొందరు బీఆర్ఎస్ నేతలు, ముఖ్య నాయకుల అనుచరులు మాత్రం కవితను వదలలేదు. ఆమె వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా ఇష్టమొచ్చినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. గతంలో జరిగినవి, జరగనవి తెరపైకి తెచ్చి దుష్ప్రచారం చేస్తున్నారు. హరీశ్‌రావు తమ్ముడు తనను పెళ్లి చేసుకోలేదనే కోపంతో ఉన్న ఆమె.. ఇప్పుడు ఆయనను టార్గెట్ చేసిందని పోస్టులు పెడుతున్నారు.

### ఎదురుదాడి..

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ల నుంచి తీవ్రమైన దాడి జరుగుతున్న తరుణంలో కవిత వర్గం కూడా ఎదురుదాడి ప్రారంభించింది. ఎప్పుడైతే ఆమెతో ఉద్యమ పార్టీ బంధాలు తెంచుకుందో అప్పటి నుంచి ఫుల్ స్ట్రాంగ్ అయిపోయింది. కవితకు వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పి కొడుతూ, ప్రత్యర్థుల లోటుమట్లను బయట పెడుతూ డిఫెన్స్‌లో పడేస్తోంది. 'సిద్దిపేట మాడల్ చిలిపి చేష్టలు', 'ట్రాక్టర్లతో 120 కోట్ల హ్యాపీ రావు ప్రగతి', కుతంత్రాల 'విద్యా' వంటి వాటితో ప్రత్యర్థుల గుట్టును రట్టు చేస్తున్నారు. అంతేకాదు.. 'దిగజారుడు రాజకీయం చేయకండి.. మీరు దూరిన సందులు గొందుల గురించి మాట్లాడే పరిస్థితి తెచ్చుకోకండి' అని హెచ్చరించారు.

### వారించని కేసీఆర్

రెండు వర్గాలు సోషల్ మీడియాకెక్కి పరువు తీసుకుంటున్నా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు గుంభనంగా ఉండిపోవడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్, కవిత వర్గాల మధ్య సోషల్ వార్ తారా స్థాయికి చేరిన తరుణంలో అధినేత కేసీఆర్ ఇప్పటికీ కిమ్మనడం లేదు. సొంత బిడ్డపై పార్టీ నేతలు, అనుచరులు ఇష్టమొచ్చినట్లు కూతలు కూస్తున్నా, సోషల్ మీడియాలో కూతురి వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నా వారించడం లేదు. అసమ్మతి గళం వినిపిస్తున్న కూతురి తీరు నచ్చలేదని పార్టీ నుంచి పంపించేశారు. రాజకీయ ఆకాంక్షలు ఉన్న బిడ్డకు మద్దతు ఇవ్వకపోయినా సరే కానీ ఆమెను దారుణంగా ట్రోల్ చేస్తుంటే కన్న తండ్రిగా పట్టనట్టు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

## కామారెడ్డి సభపై మంత్రుల సమీక్ష



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికల హామీ నిలబెట్టుకున్న సందర్భంగా కామారెడ్డిలో 15న సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సైతం పాల్గొన్నారు. సభ నిర్వహణపై సమాలోచనలు చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బీసీ కుల గణనపై ఇచ్చిన హామీని నెరవేర్చామని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో హామీ అమలుకు కృషి చేశామన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటికి కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను బీసీలకు కేటాయిస్తూ అసెంబ్లీ తీర్మానిస్తే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈనెల 15న కామారెడ్డిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించామని మంత్రులు పేర్కొన్నారు.




## పతంజలి షేర్లలో పతనం..!

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** పతంజలి ఫుడ్స్ షేర్ల ధర గురువారం భారీగా పతనమైంది. బుధవారం రోజు ఒక్కో ఈక్విటీ షేరు ధర రూ. 1,802.25 ఉండగా.. గురువారం ఉదయం రూ. 602.70 వద్ద ప్రారంభమైంది. అంటే ఒక్కరోజులోనే 67 శాతం తగ్గింది. ఇలా ఒక్కసారిగా 67 శాతం ధర పతనం కావడంతో షేర్ హోల్డర్లు కాసేపు ఆందోళన చెందారు. అయితే ధర భారీగా తగ్గిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బోనస్ షేర్ల రికార్డు తేదీ కావడంతో ఇలా షేర్ల ధర ఒక్కసారిగా తగ్గింది. జూలైలో జరిగిన సమావేశంలో పతంజలి ఫుడ్స్ డైరెక్టర్ల బోర్డు బోనస్ ఇవ్వడానికి అంగీకరించింది. ఒక్కో షేరుకు బోనస్‌గా రెండు షేర్లను జారీ చేయాలని నిర్ణయించింది. దీంతో ఒక్క షేరు మూడు షేర్లుగా మారడంతో షేరు ధర సర్దుబాటు అయ్యింది. గురువారం ఉదయం రూ. 602.70 వద్ద ప్రారంభమైన పతంజలి ఫుడ్స్ షేరు ధర చివరికి 0.44 శాతం నష్టంతో 598 వద్ద ముగిసింది.



## బాలకృష్ణకు అస్వస్థత..

**అక్షరటుడే, సినిమా డెస్క్ :** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అవస్థతకు గురయ్యారు. అనంతపురంలో జరిగిన "సూపర్ సిక్స్.. సూపర్ హిట్" సభలో మంత్రి పయ్యావుల ఈ విషయాన్ని వెల్లడించారు. "ఈ కార్యక్రమానికి బాలకృష్ణ, నారా లోకేశ్ ఇద్దరూ రావాల్సింది. కానీ బాలయ్య అనారోగ్యం కారణంగా హాజరు కాలేకపోయారు," అని చెప్పారు. అయితే బాలకృష్ణకు ఏమైంది అనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. బాలయ్య అనారోగ్యం వార్త బయటకు రావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై అధికారిక ప్రకటన ఎప్పుడు వెలువడుతుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇక నారా లోకేశ్ సభకు రాకపోవడానికి గల కారణాన్ని కూడా పయ్యావుల స్పష్టం చేశారు. నేపాల్‌లో జరిగిన హింసాత్మక ఘటనల కారణంగా అక్కడ చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా రప్పించేందుకు లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు.




## యూరియా కోసం బారులు

**రాష్ట్రంలో యూరియా కొరత మరింత తీవ్రమైంది. సరిపడా ఎరువులు దొరకక రైతాంగం అల్లాడిపోతోంది. యూరియా కోసం తెల్లవారుజాము నుంచే సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద వరుసలు కనిపిస్తున్నాయి. అదను దాటుతుండడంతో ఆగ్రహానికి లోనవుతున్న రైతులు.. పలుచోట్ల ఆందోళనకు దిగుతున్నారు. కామారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం కామారెడ్డిలో పోలీసుల పహారా నడుమ టోకెన్ల ద్వారా యూరియా పంపిణీ చేశారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్**

## నేపాల్‌లో కర్ఫ్యూ ఆంక్షల సడలింపు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** నిరసనలతో అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్నాయి. రెండ్రోజుల పాటు విధ్వంసంతో రగిలిపోయిన హిమాలయ దేశంలో కర్ఫ్యూ విధించిన సైన్యం గురువారం కొన్ని గంటల పాటు ఆంక్షలను సడలించింది. నిత్యావసరాలు, ఇతరత్రా కొనుగోళ్ల కోసం ఖాట్మండు, లలిత్‌పూర్, భక్తపూర్‌లలో అమలులో ఉన్న కర్ఫ్యూ నిబంధనలు సడలించింది. గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటలకు ప్రజలను బయటకు అనుమతించనున్నట్లు ప్రకటించింది. దీంతో గురువారం ఉదయం ఆంక్షలు ఎత్తివేసిన వెంటనే ప్రజలు మార్కెట్లు, కిరాణా దుకాణాలకు పోటెత్తారు. అత్యవసర వస్తువులను నిల్వ చేసుకోవడానికి పరుగులు పెట్టారు. "ఏ రూపంలోనైనా ప్రదర్శనలు, విధ్వంసం, దహనం లేదా ఆస్తులపై దాడులు జరిగితే వాటిని నేరపూరిత చర్యలుగా పరిగణించి, తదనుగుణంగా వ్యవహరిస్తామని" సైన్యం హెచ్చరించింది.

### పెరిగిన మృతుల సంఖ్య..

ఇటీవల హింసాత్మక ఘటనల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. 'జనరల్ జెడ్' గ్రూప్ నేతృత్వంలో జరిగిన నిరసనల్లో మరణాల సంఖ్య 30కి పెరిగింది. 1,061 మంది గాయపడ్డారని, వారిలో 719 మంది డిశ్చార్జ్ అయ్యారని, 274 మంది ఇంకా ఆసుపత్రిలోనే ఉన్నారని ఆరోగ్య, జనాభా మంత్రిత్వ శాఖ తెలిపింది.



## తెలుసు కదా టీజర్ రిలీజ్

డీజే టిల్లు చిత్రంతో ప్రేక్షకులకు దగ్గరైన యువ హీరో సిద్దు జొన్నలగడ్డ. ప్రస్తుతం ఈ కుర్ర హీరో ప్రధాన పాత్రలో 'తెలుసు కదా' అనే చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. చిత్రానికి సంబంధించిన టీజర్‌ను అధికారికంగా విడుదల చేస్తూ, ప్రమోషన్లకు శ్రీకారం చుట్టింది చిత్రబృందం. టీజర్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పాయి. టీజర్‌లో సిద్దు జొన్నలగడ్డ తనదైన స్టైల్‌లో ఆకట్టుకున్నాడు. వైవిధ్యమైన డైలాగ్ డెలివరీ, ఎమోషనల్ టోన్‌తో ఆకట్టుకున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, ఉల్లాసం మేళవింపుతో టీజర్ ఆకట్టుకుంటోంది.

**–అక్షరటుడే, సినిమా డెస్క్**